

**వృద్ధులను గౌరవించాలి** 10లో

వృద్ధులకు గౌరవమైన జీవనం కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని హెరిటేజ్ ఫౌండేషన్ ఇండియా చైర్మన్ గంగాధరన్ అన్నారు.



**‘ఓఎన్‌డీసీ’.. వ్యాపార వేదిక**

ఓఎన్‌డీసీ వ్యాపారులకు లాభదాయక వ్యాపార వేదికని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అన్నారు. 10లో



**నిలదీస్తే నిర్బంధమా?**

శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడి సొంత నియోజకవర్గం నర్సీపట్నంలోనే ప్రజాస్వామ్యానికి పోలీసులు తూట్లు పొడిచారు. 10లో

# బీ-జాగ్‌కు జీ హుజూర్



## బీచ్ రోడ్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా రెస్టారెంట్ నిర్మాణం

**బీచ్‌కు ఆనుకొని ఉన్న ఆ రెస్టారెంట్‌కు ఎటువంటి అనుమతులు లేకున్నా.. సీఆర్‌జెడ్ నిబంధనలు పాటించకున్నా.. వీఎల్‌టీ చెల్లించకున్నా.. పక్కన ఉన్న** మరొకరి స్థలంలో వారి పర్మిషన్ లేకుండానే నిర్మాణాలు చేపట్టినా.. సదరు వ్యక్తి ఫిర్యాదు చేసినా జీవీఎంసీ అధికారులు పట్టించుకోలేదు. నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇంతకీ ఎందుకంటారా.. సదరు రెస్టారెంట్ వద్ద టీడీపీ నేతలతో యజమాని కలిసి ఉన్న బ్యానర్ ఉండడమే. ఇప్పుడు అర్థమైందా విశాఖలో కూటమి నేతల కటౌట్‌కు ఎంత పవర్ ఉందో..

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

ఫిర్యాదు అందడమే ఆలస్యం ప్రతిపక్ష నేతల సొంత స్థలాల్లోని నిర్మాణాలను సైతం కూల్చివేతలకు పాల్పడుతున్న జీవీఎంసీ అధికారులు.. కూటమి పార్టీలకు చెందిన వారు బీచ్‌కు అడ్డంగా నిర్మాణాలు చేపడుతున్నా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇటు జీవీఎంసీ నుంచి కానీ.. అటు సీఆర్‌జెడ్ నుంచి కానీ ఎటువంటి అనుమతులు లేకపోయినా అటువైపు వెళ్లేందుకు సాహసించడం లేదు. కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికే విరాగో విషయంలో కేవలం నోటీసులతో సరిపుచ్చుకున్న జీవీఎంసీ అధికారులు.. భీమిలికి సమీపంలో బీ-జాగ్ బీచ్ క్లబ్ పేరిట ఉన్న రెస్టారెంట్ విషయంలోనూ మిన్నకుండిపోతున్నారు. సదరు బీచ్ క్లబ్‌కు ఎదురుగా టీడీపీ నేతలతో కలిసి ఉన్న బ్యానర్‌ను సదరు యజమాని ఏర్పాటు చేశారు. ఇక అంతే అధికారులు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఒకవైపు బీచ్‌కు అతి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేసినప్పటికీ పట్టించుకోకపోగా.. కనీసం బ్యానర్‌ను కూడా తీసివేసేందుకు చేతులు రావడం లేదంటే ఎంతగా భయపడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ఎటువంటి అనుమతులు లేకపోయినప్పటికీ అక్రమంగా విద్యుత్ కనెక్షన్ కూడా ఇచ్చినట్టు తెలుస్తోంది.

- నో డెవలప్‌మెంట్ జోన్‌లో దర్జాగా వ్యాపారం
- నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్న జీవీఎంసీ
- అధికార పార్టీ నేతల ఫ్లెక్సీలతో హల్‌చల్



బీచ్ వైపు నిర్మాణాలు

### నో వీఎల్‌టీ... నో పర్మిషన్...!



ఈ ఫొటోలో ఉన్నది బీ-జాగ్ బీచ్ క్లబ్ పేరిట ఉన్న ఓ రెస్టారెంట్. గతంలో ఇక్కడ బార్ కూడా నిర్వహించారు. జీవీఎంసీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా.. సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాన్ని చేపట్టారు. బీచ్ క్రికెట్ పేరుతో బీచ్‌కు ఆనుకుని మరీ.. బాక్స్ క్రికెట్ కోసం నిర్మాణాన్ని చేపట్టారు. అంతేకాకుండా పక్కన ఉన్న మరొకరి స్థలంలో వారి అనుమతి లేకుండానే నిర్మాణాలను కూడా చేపట్టారనే విమర్శలున్నాయి. దీనిపై ఫిర్యాదులు రావడంతో జీవీఎంసీ అధికారులు నెల రోజుల క్రితం నోటీసులు ఇచ్చారు. అసలు నిర్మాణం చేపట్టిన స్థల యజమాని ఎవరు? వారి నుంచి అనుమతి తీసుకున్నారా? సీఆర్‌జెడ్ నుంచి అనుమతి ఉందా? వంటి ప్రశ్నలతో నోటీసులు జారీ చేశారు. కానీ ఆ తర్వాత ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. వాస్తవానికి ఈ ప్రాంతానికి ఖాళీ స్థలంపై విధించే పన్ను (వీఎల్‌టీ) చెల్లించలేదు. అంతేకాకుండా ఎటువంటి అనుమతులూ లేవు. కేవలం అధికార పార్టీ నేతలతో కలిసి దిగిన ఫొటో ఫ్లెక్సీని ఉంచి మొత్తం వ్యవహారాన్ని నడిపిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### నో డెవలప్‌మెంట్ జోన్‌లో...!

నో డెవలప్‌మెంట్ జోన్‌లోకి వచ్చే ఈ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశమే లేదు. అంటే ఈ ప్రాంతంలో చేసే ఏ నిర్మాణానికి సీఆర్‌జెడ్ అనుమతించే అవకాశం లేదు. అందువల్ల ఈ ప్రాంతంలో చేపట్టే నిర్మాణానికి జీవీఎంసీ కూడా అనుమతించకూడదు. ఇందుకు భిన్నంగా నో డెవలప్‌మెంట్ జోన్‌లో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టినప్పటికీ అధికారులు మిన్నకుండిపోతున్నారు. మరోవైపు పక్కనే కేరళకు చెందిన వ్యక్తి స్థలంలో ఆయన అనుమతి లేకుండానే నిర్మాణాలను చేపట్టారనే విమర్శలున్నాయి. దీనిపై సదరు కేరళకు చెందిన కొళంగల్ వెలయాడన్ కృష్ణ.. పోలీసు అధికారులతో పాటు జీవీఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినప్పటికీ ఈ ఫిర్యాదును పట్టించుకున్న పాపాన పోలేదు. ఆయన స్థలంలో ఆయనకు సంబంధం లేకుండా నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటే ఏ స్థాయిలో అధికార పార్టీ నేతలకు అధికారులు ఊడిగం చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలంటే ఏదో ఒక అనుమతి ఉండాల్సి ఉంటుంది. ఎటువంటి అనుమతులు లేని ఈ నిర్మాణాలకు విద్యుత్‌శాఖ కనెక్షన్ ఇవ్వడంలో సదరు శాఖలోని ఒక ఉద్యోగికి కూడా వాటా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## న్యూస్‌రీల్

### మిల్లెట్ ట్రంప్



చిరుధాన్యాలతో రూపొందించిన ట్రంప్ చిత్రపటం

ఏయూక్యాంపస్: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ విశాఖకు చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ చిరుధాన్యాలతో ఆయన చిత్రపటాన్ని రూపొందించారు. తక్కువ సమయంలో.. తన కళాత్మక ప్రతిభను ప్రదర్శిస్తూ మిల్లెట్స్‌తో తీర్చిదిద్దిన ఈ చిత్రం ఎంతగానో ఆకట్టుకుంటోంది. భారత్–అమెరికా సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఈ సందర్భంగా విజయ్‌కుమార్ ఆకాంక్షించారు.

### డెంటల్ విద్యార్థినికి విజయసాయిరెడ్డి భరోసా



విజయసాయిరెడ్డికి సమస్య వివరిస్తున్న శృతి

గాజువాక: డెంటల్ కోర్సు ఆఖరి సంవత్సరం పరీక్షలు రాసేందుకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి అనుమతి ఇప్పించాలని కోరుతూ నగరంలోని రామ్‌నగర్‌కు చెందిన విద్యార్థి శృతి రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డికి వినతి పత్రం అందించింది. విశాఖ విచ్చేసిన ఆయన్ని ఎయిర్‌పోర్టులో బుధవారం కలిసి సమస్య వివరించింది. ఐదేళ్ల డెంటల్ కోర్సు పూర్తి చేయాల్సి ఉండగా, ఆర్థిక ఇబ్బందులతో ఆఖరి సంవత్సరం ఫీజు చెల్లించలేక కోర్సును పూర్తి చేయలేకపోయినట్లు తెలిపింది. ఇప్పుడు పరీక్షలు రాసేందుకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి కావాల్సి ఉందని, అందుకు సహకరించాల్సిందిగా కోరింది. దీనిపై స్పందించిన సాయిరెడ్డి.. ఈ నెల 15, 16 తేదీల్లో ఢిల్లీలో ఉంటానని, ఈ అంశంపై డెంటల్ మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాస్తానని భరోసా ఇచ్చారు.

### ఇళ్ల నిర్మాణాల్లో జోరు పెంచాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. రోజుకు 150 నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో లే అవుట్ల వారీగా కలెక్టర్ సమీక్ష నిర్వహించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు స్టేజ్ కన్వర్షన్ జరగాలని, నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు, లేఅవుట్ ఇన్‌చార్జి అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, క్షేత్ర స్థాయి అధికారులకు తగిన సహకారం అందించాలని సూచించారు. లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ, గుత్తేదార్లను అప్రమత్తం చేస్తూ పనుల్లో జోరు పెంచాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ఆళ్ల శ్రీనివాసు, ఈఈ, డీఈలు, మండల ప్రత్యేక అధికారులు, ఏఈలు పాల్గొన్నారు.

### స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు పీఎఫ్ ఎన్‌ఆర్‌ఎల్ రుణాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్)కు చెందిన నాన్ రిటర్నబుల్ రుణాలు (ఎన్‌ఆర్‌ఎల్) చెల్లించాలని నిర్ణయించారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పీఎఫ్ ట్రస్ట్‌కు ఈ ఏడాది మార్చి నుంచి చెల్లింపులు నిలిపివేయడంతో ట్రస్ట్ భవిష్యత్తు దృష్ట్యా ఎన్‌ఆర్‌ఎల్ రుణాలు, రిటైర్‌మెంట్ అయ్యే ముందు ఉద్యోగులకు ఇచ్చే 90 శాతం రుణాలను నిలిపి వేశారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగుల పిల్లల వివాహాలు, ఉన్నత విద్య అవసరాల కోసం నాన్ రిటర్నబుల్ లోన్‌లను ఇవ్వాలని నిర్ణయించారు. అయితే, ఎన్‌ఆర్‌ఎల్ పరిమితిని రూ.25 లక్షలుగా నిర్ణయించారు. బుధవారం సాయంత్రం నుంచి ఎన్‌ఆర్‌ఎల్ దరఖాస్తు చేసుకునేందుకు నెట్‌లో సదుపాయాన్ని పునరుద్ధరించారు.

### కాంబోడియా సైబర్ కేసులో మరో వ్యక్తి అరెస్ట్

విశాఖ సిటీ: విదేశాల్లో ఉద్యోగం పేరుతో అమాయకులను కాంబోడియాకు పంపించి చైనా సైబర్ ముఠాకు అప్పగిస్తున్న మల్కాపురం ప్రాంతానికి చెందిన వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. మల్కాపురం ప్రాంతానికి చెందిన దాసరి వెంకట రాఘవ పార్థసారధి వివిధ దేశాల్లో వెల్డింగ్ పనులు చేసి తిరిగి విశాఖకు వచ్చాడు. అతడికి గతంలో కాంబోడియా సైబర్ కేసులో అరెస్టయిన చుక్కా రాజేష్‌తో పరిచయమైంది. కాంబోడియాకు ఎవరినైనా పంపిస్తే కమీషన్ వస్తుందని ఆశ చూపించాడు. దీంతో పార్థసారధి ముగ్గురిని కాంబోడియాకు పంపించారు. దీనికి అతడికి మంచి కమీషన్ వచ్చింది. తర్వాత పార్థసారధి కాంబోడియాకు వెళ్లి కుక్‌గా స్థిరపడ్డాడు. అక్కడి నుంచే తెలిసిన వారికి విదేశాల్లో ఉద్యోగాలు ఉన్నాయని చెప్పి రాజేష్ ద్వారా 12 మందిని కాంబోడియాకు రప్పించాడు. అక్కడ ఫిలిప్పీన్స్‌కు చెందిన ఆర్య, హబీబ్‌లతో కలిసి వారిని చైనా స్కామ్ కంపెనీలకు పంపించాడు. అలా వెళ్లిన వారితో బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తుండడంపై విశాఖ పోలీసులకు ఫిర్యాదులు అందాయి. వారి సమాచారం మేరకు.. పోలీసులు పార్థసారధిపై ఎల్‌ఓసీ జారీ చేశారు. ఇదిలా ఉంటే పార్థసారధి కాంబోడియా నుంచి బ్యాంకాక్‌కు, అక్కడి నుంచి భువనేశ్వర్‌కు ఈ నెల 5న వచ్చాడు. భువనేశ్వర్ ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ సిబ్బంది పార్థసారధిపై ఎల్‌ఓసీ ఉన్నట్లు గుర్తించి నిలువరించి విశాఖ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకొని బుధవారం రిమాండ్‌కు తరలించారు. కాంబోడియాలో ప్రధాన ముఠా కోసం సీపీ శంఖబ్రత బాగ్చి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. బాధితులు 0891-2565454కు గానీ, సీపీ వాట్సాప్ నెంబర్ 9493336633కు గానీ సంప్రదించవచ్చు.

### రేపు జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి నిట్టల శ్యామ్ సుందర్ తెలిపారు. నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, ఏషియన్ ఆటోపార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో 75 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18–27 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. విశాఖ, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో జాబ్ లొకేషన్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# మత్స్యశాఖలో అనిశ్చితి

- ఎప్పటికప్పుడు మారిపోతున్న జాయింట్ డైరెక్టర్లు
- మూడు నెలల కిందట జేడీగా వచ్చిన విజయ
- తాజాగా కాకినాడకు ఆమె బదిలీ.. కొత్త జేడీగా లక్ష్మణరావు
- జేడీ మార్పులో చక్రం తిప్పిన నగర పరిధిలోని ఎమ్మెల్యే?



బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మణరావు

మహారాణిపేట: విశాఖ మత్స్యశాఖలో అనిశ్చితి నెలకొంది. శాఖలో కీలకమైన జాయింట్ డైరెక్టర్లు ఎప్పటికప్పుడు మారిపోతున్నారు. కనీసం మూడు నెలలు కాక ముందే సీటు ఖాళీ అయిపోతోంది. ప్రభుత్వ అస్పష్ట విధానాలతో ఈ గందరగోళ పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు నెలల కాలంలో ఇప్పటివరకు ఇద్దరు జేడీలు మారారు. బుధవారం నూతన జేడీగా లక్ష్మణరావు పదవీ బాధ్యతలు చేపట్టారు. మత్స్యశాఖ(అమరావతి) పరిధిలోని ఇరిగేషన్ శాఖలో జేడీగా పని చేస్తున్న లక్ష్మణరావును ఇక్కడ జేడీగా ప్రభుత్వం నియమించింది.

మత్స్యశాఖ కేంద్ర కార్యాలయంలో ఉన్నతాధికారుల పాత్ర, ప్రభుత్వ అస్పష్ట విధానాల కారణంగా విశాఖ మత్స్యశాఖలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. ఒక వైపు ఈ పోస్టు కోసం పోటీ ఉన్నప్పటికీ.. వచ్చిన వారు మూడు నెలలు కూడా ఉండకపోవడం గమనార్హం. గతంలోనూ మత్స్యశాఖలో వివాదాలు నెలకొన్నాయి. మత్స్యశాఖ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగితో పూర్వ జాయింట్ డైరెక్టర్ ఎస్.కె.లాల్ మహమ్మద్ అసభ్యకరంగా ప్రవర్తించారు. దీనిపై ఆమె ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడం, పోలీసులు జేడీపై కేసు నమోదు చేశారు. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులు జేడీపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అతని స్థానంలో పూర్తి అదనపు బాధ్యతల(ఎఫ్‌ఏసీ)తో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.విజయకృష్ణను జేడీగా నియమించారు. తర్వాత ఆయన స్థానంలో 2024 జులై 22న కాకినాడలో స్టేట్ ఫిషరీస్ ఇన్‌స్టిట్యూట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.విజయను విశాఖ జేడీగా తీసుకొచ్చారు. ఆమె జులై 23న బాధ్యతలు స్వీకరించారు. ఇంతలోనే ఆమెపై వేటు పడింది. బదిలీల నిషేధ సమయంలో విజయను ఇక్కడ నుంచి బదిలీ చేయడం, గతంలో ఇక్కడ పనిచేసిన లక్ష్మణరావును మళ్లీ జేడీగా నియమించడం చకచకా జరిగిపోయాయి. ఈ నియామకం వెనుక నగర పరిధిలో ఓ ఎమ్మెల్యే చక్రం తిప్పినట్టు సమాచారం. ఆ ఎమ్మెల్యే తన పలుకుబడిని ఉపయోగించి లక్ష్మణరావుకు పోస్టింగ్ ఇప్పించినట్టు తెలుస్తోంది.

**మత్స్యకారుల ఆందోళన**

మత్స్యశాఖకు సంబంధించి అన్ని రకాల ఎగుమతులు, దిగుమతులు విశాఖ నుంచే జరుగుతుంటాయి. చేపలు, రొయ్యలు, ఇతర మత్స్య సంపద ఎగుమతుల వల్ల విదేశీ మారక ద్రవ్యం రావడంలోనూ మత్స్య శాఖ కీలకపాత్ర పోషిస్తోంది. అలాగే ఫిషింగ్ హార్బర్‌లో సుమారు లక్ష మంది మత్స్యకారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా మత్స్య పరిశ్రమ మీద ఆధార పడి జీవిస్తున్నారు. ఇలా తరచూ జేడీలను బదిలీలు చేయడం వల్ల ఇక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. కొత్తగా వచ్చిన వారికి ఇక్కడ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి సమయం పట్టడం వల్ల మత్స్య పరిశ్రమపై ప్రతికూల ప్రభావం చూపుతోందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

### బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

విశాఖ సిటీ : విశాఖ బాలోత్సవం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ బుధవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు సెయింట్ ఆంథోనీ ప్రైమరీ స్కూల్లో ఈ బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి జి.ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. పోటీల వివరాలను అన్ని స్కూళ్లకు పంపించినట్లు తెలిపారు. పెందుర్తి నుంచి ఎన్ఏడీ కొత్త రోడ్డు వరకూ ఉన్న స్కూళ్ల విద్యార్థులకు డిసెంబర్‌లో వేరుగా నిర్వహిస్తామని వెల్లడించారు.

# బాబు పాపాలే శాపాలవుతాయి

- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు
- సుప్రీంకోర్టు తీర్పునకు భిన్నంగా రెండు రోజుల్లో 100 మంది అరెస్ట్
- అధికారం శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తు పెట్టుకోవాలి
- ప్రణాళిక ప్రకారం కాపులను, పవన్ కల్యాణ్‌ను అణగదొక్కుతున్నారు
- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి



రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు

విశాఖ సిటీ: ‘సుప్రీం కోర్టు తీర్పునకు భిన్నంగా రెండు రోజుల్లో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేశారు. వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారు. చంద్రబాబు, లోకేష్ చేసే ఈ తప్పులకు పదింతలు అనుభవిస్తారు. బాబు చేసే పాపాలు నాగుపాములా లోకేష్ మెడకు చుట్టుకుంటాయి. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని చంద్రబాబు గుర్తుంచుకోవాలి’ అని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి హెచ్చరించారు. బుధవారం విశాఖకు వచ్చిన ఆయనకు జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..

**2027లో మళ్లీ అధికారంలోకి వస్తాం..**

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్న కారణంగా ఎవరినీ అరెస్టు చేయకూడదని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి. అందుకు భిన్నంగా పోలీసులు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. రెండు రోజుల్లోనే 100 మందిపై కేసులు నమోదు చేశారు. దీన్ని వైఎస్సార్ సీపీ చూస్తూ ఊరుకోదు. తప్పకుండా బదులిస్తుంది. సోషల్ మీడియా కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది. వైఎస్సార్ సీపీ హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు అనేక ప్రయోజనాలు చేకూర్చాం. కానీ చంద్రబాబు మోసపూరిత హామీలిచ్చి మోసం చేశారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సుపరిపాలనను ఐదు నెలల్లోనే నాశనం చేశారు. చంద్రబాబు పరిపాలన చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు. 2027లో మళ్లీ నూటికి నూరు శాతం వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుంది.

**చంద్రబాబు మూర్ఖుడా? అసమర్థుడా..?**

రుషికొండపై నిర్మించిన అద్భుతమైన భవనాలను ఎలా ఉపయోగించుకోవాలో తెలియడం లేదంటున్న చంద్రబాబు మూర్ఖుడో.. అసమర్థుడో.. ఏమనుకోవాలో అర్థం కావడం లేదు. అవి రాష్ట్రానికి తలమానికమైనవి. వాటిని ఎలా ఉపయోగించాలో అర్థం కాకపోతే ప్రొఫెషనల్స్ లేదా కన్సల్టెన్సీకి ఇస్తే వారే మంచి సలహా ఇస్తారు.

**ద్వితీయ శ్రేణి పౌరుడిగా పవన్‌కల్యాణ్**

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ని కూటమి ప్రభుత్వంలో ఒక ద్వితీయ శ్రేణి పౌరుడిగా చూస్తున్నారు. అధికారంలోకి రాక ముందు లోకేష్.. పవన్‌కు పాదాభివందనం చేశాడు. ఇప్పుడు పవన్ ఆదేశాలు పాటించవద్దని అధికారులకు ఆదేశాలిస్తున్నాడంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఒక ప్రణాళిక ప్రకారం నెల నెలా కాపు సామాజికవర్గాన్ని, పవన్ కల్యాణ్‌ను అణగదొక్కుతున్నారు. చంద్రబాబును కలిసిన ఒక గంట తరువాత మందకృష్ణ మాదిగ బయటికొచ్చి పవన్‌ను విమర్శించారంటే చంద్రబాబు మార్కు రాజకీయాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇది ఆరంభం మాత్రమే. భవిష్యత్తులో పవన్ కల్యాణే తెలుసుకుంటారు. పవన్‌ను కూటమిలో కొనసాగే అవకాశం లేకుండా చేస్తారు. ఆయన ఉంటే లోకేష్ ముఖ్యమంత్రి అవడానికి అడ్డంకులు వస్తాయని భావిస్తున్నారు. రాష్ట్రంలో 20 శాతానికి పైగా కాపులు ఉన్నారు. అటువంటి పెద్ద సామాజిక వర్గాన్ని ఏరోజైనా ఎదుర్కోవాలంటే కష్టం. అందుకే ఒక ప్రణాళికా బద్ధంగా కాపులను, జనసేనను అణిచి వేసే కార్యక్రమం చేస్తున్నారు.

**కచ్చితంగా వన్ నేషన్-వన్ ఎలక్షన్**

కేంద్రంలో వివిధ నాయకులతో సత్సంబంధాలు ఉన్న నేతగా చెబుతున్నా.. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ జరగబోతోంది. దీంతో పాటు మహిళా రిజర్వేషన్ వచ్చి తీరుతుంది. డీలిమిటేషన్ జరిగి రాష్ట్ర శాసనసభలో ఎమ్మెల్యేల సంఖ్య, పార్లమెంట్‌లోని ఎంపీల సంఖ్య పెరుగుతుంది. ఈ మూడు తప్పకుండా జరిగి తీరుతాయన్నది నా అంచనా.

విజయసాయిరెడ్డికి విమానాశ్రయంలో స్వాగతం పలికిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), సమన్వయకర్తలు కె.కె.రాజు, మలసాని భరత్‌కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కె.సతీష్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, చెంగల వెంకట్రావు, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాస్, కార్పొరేటర్లు వంశీ రెడ్డి, పి.వి.సురేష్, ముఖ్యనేతలు బొడ్డేడ ప్రసాద్, జాన్ వెస్లీ, మొల్లి అప్పారావు, ఆల్ఫా కృష్ణ, కొండా రాజీవ్‌గాంధీ, గండి రవికుమార్, వాసుగౌడ్, బి.పద్మావతి, పల్లా చినతల్లి తదితరులు ఉన్నారు.

# పారదర్శకంగా విధులు నిర్వర్తించండి

- ఆర్పీలకు జీవీఎంసీ కమిషనర్ సూచన
- ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న కమిషనర్ సంపత్ కుమార్



శిక్షణకు హాజరైన ఆర్పీలు

బీచ్‌రోడ్డు: ఆర్పీలు ప్రజలకు అంకితభావంతో సేవలందించాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ పిలుపునిచ్చారు. గురజాడ కళాక్షేత్రంలో ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ వినియోగం, విధి విధానాలపై బుధవారం జీవీఎంసీ పరిధిలోని ఆర్పీలకు వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆర్పీలు ఒక శక్తిగా ఉండాలన్నారు. నవంబర్ 31లోగా ఎస్‌హెచ్‌జీ యాప్‌లో పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. కోవిడ్ తర్వాత చాలా కుటుంబాలు పేదరికంలోకి వెళ్లాయని.. అటువంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా పిల్లల చదువులకు, అక్కరలేని ఆడంబరాలకు ప్రజలు విపరీతమైన ఖర్చులు చేసి పేదరికంలోకి వెళ్లిపోతున్నారని.. అటువంటి వారిని గుర్తించి వారు పేదరికానికి గురి కాకుండా సలహాలు ఇవ్వాలన్నారు. ఎస్‌హెచ్‌జీ యాప్‌లో వాస్తవాలు నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హులను సులభంగా గుర్తించగలమన్నారు. అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, యూసీడీ పీడీ పి.ఎం.సత్యవేణి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల స్థితిగతులు, సంఘ సభ్యుల జీవన విధానం తదితర వివరాలు నమోదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. యాప్‌లో ఎలా నమోదు చేయాలనే విషయంపై స్లమ్ సమాఖ్య రిసోర్స్ పర్సన్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, పట్టణ సమాఖ్య రిసోర్స్ పర్సన్లు, ఏపీడీలకు మెప్మా రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి వర్చువల్‌గా శిక్షణ ఇచ్చారు.

# ఆటో బోల్తా.. 12 మందికి స్వల్పగాయాలు

జగదాంబ: ఆటో బోల్తా పడిన ఘటనలో 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి. విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం రంగరాయపురం గ్రామానికి చెందిన 12 మంది ఆటోలో బుధవారం ఉదయం 8 గంటల సమయంలో జీవీఎంసీ 39వ వార్డులోని కన్నె మేరీమ్మ ఆలయానికి వచ్చారు. ప్రార్థనల అనంతరం 11 గంటల సమయంలో ఘాట్ రోడ్డు దిగుతుండగా బ్రేక్ ఫెయిలై ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న ప్రయాణికులందరూ రోడ్డుపై పడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఆటో డ్రైవర్ సద్గురు, ఎస్.అప్పలరాజు, ఎస్.శివమ్మ, జె.పెంటయ్య, ఎస్.రమణమ్మ, జె.కనక, పి.రమణమ్మ, ఎస్.పరదేశి, ఎస్.కృష్ణ, కె.తన్విష్, ఎస్.జోగి, జె.జోగి ఉన్నారు. సమాచారం అందుకున్న హార్బర్ స్టేషన్ ఎస్ఐ మోహనరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయాలపాలైన వారందరినీ చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం 11 మంది డిశ్చార్జి కాగా పరదేశి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రమాదంలో గాయపడిన వారిని ఒక్కచోటకు చేర్చుతున్న ఎస్ఐ మోహనరావు

## విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి

విశాఖ సిటీ: విద్యుత్ ట్రూ అప్ చార్జీలు, ఫ్యూయల్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని విశాఖపట్నం అపార్ట్‌మెంట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్(వార్వా) ప్రధాన కార్యదర్శి బి.బి.గణేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.14 వేల కోట్లకు పైగా బాదడానికి రంగం సిద్ధమైందని తెలిపారు. 2022–23 సంవత్సరానికి రూ.6,072 కోట్లు ట్రూ అప్ చార్జీలు వసూలు చేయాలని ఏపీఈఆర్‌సీ ఉత్తర్వులు జారీ చేసిందని వెల్లడించారు. అలాగే 2023–24కు సంబంధించి ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ కోసం రూ.8,126 కోట్లు వసూలుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ విద్యుత్ పంపిణీ సంస్థలు, డిస్కమ్‌లు ఏపీ ఈఆర్‌సీకి మళ్లీ ప్రతిపాదనలు పంపించాయని వివరించారు. ఇంతకు ముందే ఒక ఎఫ్‌పీపీసీఏ ప్రతి నెల విద్యుత్ బిల్లుతో వసూలు చేస్తున్నారని, ఇప్పుడు మరో రెండు చార్జీలు బిల్లులో కలుస్తాయని తెలిపారు. ఈ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సీఎం, డిప్యూటీ సీఎంలకు వినతిపత్రాలను పంపించినట్లు తెలిపారు.

**THE CHODAVARAM CO-OPERATIVE SUGARS LIMITED, NO.B.1109, GOVADA**
Chodavaram Mandal, Anakapalli District, A.P.

**E-Procurement Tender Notice**

E-Procurement for Engineering Material and AMC and O & M of Turbines to the Chodavaram Co-operative Sugars Limited, Govada for item Nos. 01 to 06 through e-auction. The list of 01 to 06 items and Tender Document consisting of terms & conditions and specifications of each item can be viewed in www.apeprocurement.gov.in (Tender ID No. 763649)

| | | |
|---|---|---|
| Bid Document download starting | : Date & Time | : 07-11-2024 from 09-00 A.M. |
| Bid Document download end | : Date & Time | : 12-11-2024 from 01-00 P.M. |
| Bid Document submission closing | : Date & Time | : 12-11-2024 at 04-00 P.M. |
| Financial Bid opening | : Date & Time | : 13-11-2024 from 02-00 P.M. |

Place : Govada
Date : 06-11-2024
MANAGING DIRECTOR

इंडियन बैंक ఇండియన్ బ్యాంక్
సీతమ్మధార బ్రాంచ్
డోర్ నెం.50-96-8/5, మొదటి అంతస్తు, ప్లాట్ నెం.ఎమ్ఐజి-23, సీతమ్మధార, ఎస్ఐ లే అవుట్, విశాఖపట్నం - 530013. ఫోన్. 0891-2723300

(Appendix IV) **స్వాధీనత ప్రకటన**

రూలు 8(1) ప్రకారం (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము **ఇండియన్ బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి సెక్షన్ 13 (12)కు అనుబంధమైన రూల్స్ 8 మరియు 9 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత : ఋణగ్రహీత నివాస చిరునామా : శ్రీ బోలెం అక్కన్న పాత్రుడు (దరఖాస్తుదారు)** తండ్రి : ఎర్రన్న పాత్రుడు, 50–53–4/4, నార్త్ ఎక్స్‌టెన్షన్ లే అవుట్, సీతమ్మధార, విశాఖపట్నం – 530013. **హామీదారు నివాస చిరునామా: శ్రీమతి బోలెం విజయలక్ష్మి (హామీదారు)**, భర్త: అక్కన్న పాత్రుడు, 50–53–4/4, నార్త్ ఎక్స్‌టెన్షన్ లే అవుట్, సీతమ్మధార, విశాఖపట్నం - 530013. వారు **తేది.27.08.2024** నాటికి చెల్లించవలసిన బకాయి **లోన్ నెం. 6655977715**నకు **రూ.29,70,910/-** (అక్షరాల ఇరవై తొమ్మిది లక్షల డెబ్బై వేల తొమ్మిది వందల పది రూపాయలు మాత్రమే) తదుపరి వడ్డీతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.28-08-2024**న **డిమాండ్ నోటీసు** జారీ చేయబడినది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూల్స్ 8 మరియు 9 ప్రకారము **తేది.05-11-2024**న దిగువ పేర్కొన్న ఆస్తిని **స్వాధీనత** తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా **తేది.04.11.2024** నాటికి చెల్లించవలసిన బకాయి **లోన్ నెం. 6655977715**నకు **రూ.29,74,395/-** (అక్షరాల ఇరవై తొమ్మిది లక్షల డెబ్బై నాలుగు వేల మూడు వందల తొంభై ఐదు రూపాయలు మాత్రమే) + **తేది.05-11-2024** నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు **ఇండియన్ బ్యాంక్** వారి ఛార్జీకి లోబడి వుండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

స్థిరాస్తి వివరములు

**తనఖా ఆస్తులు : బోలెం అక్కన్న పాత్రుడు గారి పేరున గల ఆస్తి:** విశాఖపట్నం, జివిఎమ్‌సి పరిధిలో, రేసపువానిపాలెం గ్రామం, ఆర్.ఎస్.నెం. 6 పార్ట్, సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ లే అవుట్ వద్ద డి.నెం.50–53–4/4 లోని ప్రతి ఫ్లోర్ 900 చ॥అ॥ల విస్తీర్ణం కలిగిన జి+3 ఫ్లోర్స్‌తో గల ఎమ్ఐజి ప్లాట్ నెం.255 దక్షిణ భాగంలో 104 చ॥గ॥ల విస్తీర్ణం గల స్థలం యావత్తు ఆస్తి. **హద్దులు: ఉత్తరం** : అమ్మకందారుల స్వంత ఇల్లు 50–53–4/3, **తూర్పు** : ఇతరుల ప్రహరీ గోడ, పడమర: రోడ్డు, **దక్షిణం** : నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్స్. **కొలతలు : తూర్పు నుండి పడమర:** 58.1/2 అ॥లు లేదా 17.83 మీ॥లు., **ఉత్తరం నుండి దక్షిణం:** 16 అ॥లు లేదా 04.87 మీ॥లు.,

తేది : 05-11-2024
ప్రదేశం : విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి
ఇండియన్ బ్యాంక్

# నిలదీస్తే నిర్బంధమా?

ఇసుక దొంగలతో అనుబంధం.. ప్రశ్నించిన గొంతులపై నిర్బంధం.. ఇదీ నర్సీపట్నంలో పోలీసు నీతి. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడి సొంత నియోజకవర్గం నర్సీపట్నంలోనే ప్రజాస్వామ్యానికి పోలీసులు తూట్లు పొడిచారు. టీడీపీ నేతల ఇసుక దోపిడీని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నేతలపైనే కేసులు పెట్టి, అధికార పక్షానికి కొమ్ముకాశారు. దీనికి వ్యతిరేకంగా శాంతియుతంగా బుధవారం ధర్నాకు దిగిన మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌ను, పార్టీ నాయకులను అరెస్టు చేసి తమ దమననీతిని చాటుకున్నారు.

- గబ్బాడ ఇసుక డిపో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టీడీపీ నేతలు
- వారితో అంటకాగుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసుల బనాయింపు
- నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ వైఖరిపై మాజీ ఎమ్మెల్యే గణేష్ నిరసన గళం
- శాంతియుత ధర్నాకు వెళుతుండగా ఆయనతో పాటు 72 మంది పార్టీ శ్రేణుల అరెస్ట్


మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను మెడపై చేయి వేసి గెంటుతున్న పోలీసులు

సాక్షి, అనకాపల్లి/నర్సీపట్నం: ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ గబ్బాడ ఇసుక డిపో నుంచి నాలుగు నెలలుగా టిప్పర్లతో అక్రమంగా ఇసుక తరలిస్తున్న అయ్యన్నపాత్రుడి అనుచరులు, టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారిపై చర్యలు తీసుకోకపోగా.. తిరిగి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపైనే రూరల్ సీఐ రేవతమ్మ కేసులు నమోదు చేశారు. అధికార పార్టీ నేతలకు కొమ్ము కాస్తున్న సీఐ వైఖరికి నిరసనగా బుధవారం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శాంతియుత ధర్నా తలపెట్టారు. బుధవారం ఉదయం వారు స్టేషన్‌కు బయలుదేరేటప్పటికే గురుకుల పాఠశాల మెయిన్ రోడ్డుపై పోలీసులు మోహరించారు. పార్టీ నాయకులతో వస్తున్న మాజీ ఎమ్మెల్యేను మార్గం మధ్యలోనే అడ్డుకోవడంతో మాజీ ఎమ్మెల్యే, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సీఐ టీడీపీ కార్యకర్తలా పని చేస్తున్నారని, సీఐ పెట్టిన తప్పుడు కేసులపై నిరసన తెలిపే హక్కు లేదా అని గణేష్ పోలీసులను ప్రశ్నించారు. అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో సీఐ తప్పుడు కేసులు బనాయిస్తున్నారని, రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని పోలీసులను హెచ్చరించారు. టౌన్ సీఐ గోవిందరావు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సీఐలు అప్పన్న, అశోక్‌కు మాజీ ఎమ్మెల్యేకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసుల జులుం నశించాలంటూ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, పార్టీ ఎస్సీ సెల్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, నాయకులను అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను కొత్తకోట పోలీసు స్టేషన్‌కు, మిగిలిన నాయకులను కోటవురట్ల, రోలుగుంట పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేతల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు.


పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి

### 72మంది వైఎస్సార్‌సీపీ శ్రేణుల అరెస్ట్

ఈ ఘటనకు సంబంధించి నర్సీపట్నంలో 32మందిని, మాకవరపాలెంలో 40 మందిని మొత్తం 72 మందిని అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను కొత్తకోట పోలీస్‌స్టేషన్‌కు, మిగతా నేతలు, కార్యకర్తలను కోటవురట్ల, రోలుగుంట పోలీస్ స్టేషన్లకు తరలించారు. సాయంత్రం 6 గంటల వరకు స్టేషన్‌లో ఉంచి విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే గణేష్ ధర్నాకు సంఘీభావంగా గొలుగొండ, నాతవరం తదితర ప్రాంతాల నుంచి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పోలీసులు ఆయా ప్రాంతాల్లో అడ్డుకున్నారు.

### పోలీసుల ఓవరాక్షన్..

నర్సీపట్నంలో బుధవారం తెల్లవారుజాము నుంచే పోలీసుల ఓవరాక్షన్ మొదలయింది. వైఎస్సార్‌సీపీ తలపెట్టిన ఆందోళనను భగ్నం చేసేందుకు ఎక్కడికక్కడ నాయకులు, కార్యకర్తలను నిర్బంధించినప్పటికీ, వివిధ మార్గాల్లో వందల మంది నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే గణేష్ ఇంటికి చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ ధర్నా నేపథ్యంలో పోలీస్ యాక్ట్–30ను అమల్లోకి తెచ్చారు. మంగళవారం రాత్రి నుంచి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ధర్నాను భగ్నం చేసేందుకు పోలీసులు ఎక్కడికక్కడ పోలీస్ పికెట్ పెట్టినా పలు దారుల్లో మాజీ ఎమ్మెల్యే ఇంటికి చేరుకుని అరెస్ట్ చేశారు.

## విద్యుత్ షాక్‌తోనే జూనియర్ లైన్‌మన్ మృతి


ప్రమాదం జరిగింది ఇక్కడే ..

మధురవాడ: విద్యుత్ షాక్ వల్లే జూనియర్ లైన్‌మన్ బలివాడ వెంకటేష్(37) మృతి చెందినట్టు విద్యుత్ శాఖ అధికారులు నిర్ధారించారు. కొమ్మాది సబ్ స్టేషన్ పరిధి మారికవలస టయోటా షోరూం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంగళవారం రాత్రి బ్రేక్‌డౌన్ పనులు చేస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్‌పై నుంచి షాక్‌కు గురైన వెంకటేష్ కిందకు పడడంతో తలకు రాయి తగిలి అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇటువంటి పనులు చేయాల్సి వచ్చినప్పుడు కనీసం ఇద్దరికి తక్కువ లేకుండా సిబ్బందిని అధికారులు పంపించాలి. కానీ వెంకటేష్ ఒక్కడే అక్కడకు వెళ్లాడు. ఏబీ స్విచ్‌ను ఓపెన్ చేసిన తర్వాత విద్యుత్ లైన్ వద్ద ఉన్న 3 పోస్ట్ టైప్ ఇన్సులేటర్లలో ఒకటి ఓపెన్ కాక.. పవర్ కట్ అవ్వకపోవడంతోనే లైన్‌మన్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడని తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీస్ దర్యాప్తుతో పాటు ఈపీడీసీఎల్ ఏడీ ఆధ్వర్యంలో శాఖపరమైన విచారణ జరుగుతోంది. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, లైనమన్‌పై ఉన్న సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తరచూ ఇటువంటి సంఘటన జరుగుతున్నా.. అధికారులు మాత్రం సిబ్బంది భద్రత విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## • హాయి నీది.. నిరీక్షణ మాది.!


జూ పార్కులో ఖడ్గమృగం ఎన్‌క్లోజర్‌లో నీటి మడుగు చుట్టూ చేరిన పక్షులు చేపల కోసం ఆశగా ఎదురుచూస్తూ కనిపించాయి. ఒకవైపు ఆ నీటిమడుగులో ఖడ్గమృగం రోజూ పగటి సమయంలో హాయిగా గడుపుతూ ఉంటే.. మరోవైపు అదే నీటిలో చేపలను పట్టుకుని ఆకలి తీర్చుకునేందుకు పెయింటెడ్ స్టార్క్ పక్షులు రోజూ ఆ మడుగు చుట్టూ చేరి నిరీక్షిస్తూ ఉంటాయి. హుద్‌హుద్ తుపాను సమయంలో జూలో ఉన్న ఈ పక్షుల గూళ్లు చెదిరిపోవడంతో, అప్పటి నుంచి వీటికి ప్రత్యేకంగా ఆవాసం లేదు. జూ లోపల చెట్లపై గడుపుతాయి. ఈ పక్షులకు ఆహారం కోసం జూ సిబ్బంది ఇక్కడ మడుగులో రోజూ చేపలు వేస్తుంటారు. ఆ చేపల కోసం ఈ పక్షులు ఇక్కడ మడుగు చుట్టూ చేరుతాయి. బుధవారం అలా ఎదురుచూస్తున్న పక్షులు, మడుగులో ఖడ్గమృగం 'సాక్షి' కెమెరాకు చిక్కాయి. - ఆరిలోవ

## ఉజ్బెకిస్తాన్‌లో యాతపాలెం వాసి మృతి


ఆనంద్ (ఫైల్)

పెదగంట్యాడ: బతుకు తెరువు కోసం ఉజ్బెకిస్తాన్ వెళ్లిన ఓ వెల్డర్ అక్కడ మృతి చెందాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొప్పనాతి ఆనందరావు (43) పెదగంట్యాడ మండలం యాతపాలెంలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. వెల్డర్ అయిన అతను గత ఆగస్టు 31న ఉపాధి కోసం ఉజ్బెకిస్తాన్ వెళ్లాడు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత అక్కడ పరిస్థితులు బాగా లేవని కుటుంబ సభ్యులకు ఈ నెల 2న రాత్రి వాయిస్ మెసేజ్ పంపించాడు. ఇంతలో ఏమైందో ఏమో ఆనంద్‌కుమార్ మృతి చెందాడని 3వ తేదీ రాత్రి అక్కడి నుంచి కుటుంబ సభ్యులకు ఓ వ్యక్తి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు లోనయ్యారు. తన కుమారుడి మృతిపై తల్లి కొప్పనాతి అనూరాధ న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 'కూల్ జోన్' యజమాని కుటుంబానికి న్యాయం చేయాలి

సీతమ్మధార: 'కూల్ జోన్'యజమాని సాయిగణేష్ కుటుంబానికి న్యాయం చేయాలని రాధా రంగా రాయల్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదె బాలాజీ కోరారు. సాయి గణేష్ భార్య కొవ్వూరు విజయ కుమారి, పెద్ద కుమార్తె సరితతో పాటు కుటుంబ సభ్యులు, కూల్ జోన్ సిబ్బంది బుధవారం డైమండ్ పార్క్ వద్ద గల సోనోవిజన్ షోరూం ముందు రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో కొంత సేపు ట్రాఫిక్ నిలిచి పోయింది. ద్వారకా పోలీసులు అక్క డకు చేరుకుని.. వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశా రు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పోలీసులు ఆందోళనకారులకు అదుపులోకి తీసుకున్నారు. అంతకుముందు డైమండ్ పార్క్ సమీపంలోని కూల్ జోన్ షోరూం వద్ద గాదె బాలాజీ మీడియాతో మాట్లాడారు. గణేష్ ఏసీ టెక్నీషియన్‌గా జీవితం ప్రారంభించి.. 14 స్టోర్స్ స్థాపించే స్థాయికి ఎదిగాడన్నారు. గణేష్ చనిపోయే ముందు తీసుకున్న వీడియోను పోలీసులు ఎందుకు పరిగణలోకి తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆ షోరూంలను ముట్టడిస్తామని హెచ్చరించారు. గణేష్ భార్య విజయ కుమారి మాట్లాడుతూ తమ కుటుంబం అన్యాయం అయిపోయిందన్నారు. పెద్ద కుమార్తె సరిత మాట్లాడుతూ ఐదేళ్లుగా తాను పడుతున్న ఇబ్బందులు గురించి నాన్న చెప్పేవారని.. కానీ ఇలా అవుతుందని కలలో కూడా ఊహించలేదని కన్నీటిపర్యంతమయ్యారు. కూల్ పాయింట్ సిబ్బంది మాట్లాడుతూ తమను కూడా సొంత కుటుంబ సభ్యులు మాదిరిగానే గణేష్ చూసుకునే వారని చెప్పారు.


పోలీసులు, గణేష్ భార్య విజయకుమారి, షోరూం సిబ్బంది మధ్య వాగ్వాదం

## తల్లిదండ్రులు మందలించారని బాలుడి ఆత్మహత్య

విశాఖ విద్య: బడికి తరచూ డుమ్మా కొడుతున్నాడని మందలించినందుకు ఓ బాలుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుమారులే సర్వస్వం అని ఎంతో అల్లారు ముద్దుగా చూసుకుంటున్న ఆ తల్లిదండ్రులకు ఊహించని రీతిలో జరిగిన ఈ ఘటన తేరుకోలేకుండా చేసింది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. గోపాలపట్నం మండల పరిధిలోని కొత్తపాలెంలో నివాసం ఉంటున్న దంపతులకు ఇద్దరు కుమారులు. ఇద్దరూ ప్రైవేట్ ఉద్యోగులు. కుమారులిద్దరినీ బాగా చదివించుకోవాలనే తపనతో ప్రైవేట్ స్కూళ్లలో వేశారు. చిన్న కుమారుడు(12) కొత్తపాలెంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో 7వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు తరచూ డుమ్మా కొడుతుండటంతో పాటు చదువుల్లోనూ బాగా వెనుకబడుతున్నాడు. దీనిపై కుమారుడిని పలుమార్లు తల్లిదండ్రులిద్దరూ మందలించి బాగా చదువుకోవాలని సూచించారు. అయినప్పటికీ అదే పంథాను అవలంబిస్తూ.. బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండిపోతున్న విషయాన్ని గుర్తించారు. బుధవారం మరోమారు మందలించారు. తర్వాత భార్యను ఆమె విధులు నిర్వర్తిస్తున్న కాలేజీ వద్ద దింపి.. తిరిగి ఇంటికి వచ్చిన ఆయనకు ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని వేలాడుతున్న కుమారుడు కనిపించాడు. దీంతో తీవ్ర ఆందోళన చెందిన ఆయన వెంటనే బాలుడిని కిందకు దింపి హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు ఇలా అఘాయిత్యానికి పాల్పడి, తమకు దూరమైపోవడాన్ని ఆ తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. జరిగిన విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. గోపాలపట్నం సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పీఎంఏవై ఇళ్ల నిర్మాణాలకు ఆటంకాలు కలిగించొద్దు

స్థానికులతో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

పరవాడ: పెదముషిడివాడలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) పథకంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలకు ఎలాంటి ఆటంకాలు కలిగించవద్దని స్థానికులను విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం ఆయన హౌసింగ్ లేఅవుట్‌ను సందర్శించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులకు స్థానికుల నుంచి ఎదురవుతున్న ఆటంకాల నేపథ్యంలో ఆయన లే అవుట్ వద్ద పరిస్థితుల్ని స్వయంగా పరిశీలించారు. ఆటంకాలకు గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్ ఏర్పాటుకు భూసేకరణ జరిపి, బదులుగా తమకు వేరే చోట కేటాయించిన స్థలానికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందించలేదని వారు కలెక్టర్‌కు తెలిపారు. లబ్ధిదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని భరోసా నిచ్చారు. వెంటనే సమస్యపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌తో ఫోన్లో సంప్రదించి చర్చించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాసరావు, పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, గృహ నిర్మాణ శాఖ అధికారులు ఉన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

## 'ఓఎన్‌డీసీ' లాభదాయక వ్యాపార వేదిక

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓఎన్‌డీసీ(ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్) చిరు వ్యాపారులు, ఉత్పత్తిదారులు, ఎస్‌హెచ్‌జీ మహిళా వ్యాపారులకు మంచి లాభదాయక వ్యాపార వేదికని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అన్నారు. ఓఎన్‌డీసీ వినియోగంపై జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓఎన్‌డీసీ ఆన్‌లైన్ వ్యాపార వేదిక దేశంలోనే మొట్టమొదటి ఓపెన్ నెట్‌వర్క్ అని.. చిన్న వ్యాపారులు, ఉత్పత్తిదారులు, ఎస్‌హెచ్‌జీ మహిళా వ్యాపారులు తక్కువ కమీషన్‌తో తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశం లభిస్తుందన్నారు. మెప్మా సహకారంతో ఎస్‌హెచ్‌జీ మహిళలు ఉత్పత్తి చేసిన 185 రకాల వస్తువులను ఇప్పటికే ఓఎన్‌డీసీలో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. ఓఎన్‌డీసీకి సంబంధించిన సందేహాల నివృత్తికి మెప్మా యంత్రాంగం అందుబాటులో ఉంటుందని కమిషనర్ తెలిపారు. ఓఎన్‌డీసీ సాంకేతిక సహాయకుడు బాలశేఖర్(6305875089)ను కూడా కార్యాలయ పని దినాల్లో సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. అనంతరం మెప్మా ప్రధాన కార్యాలయం నుంచి ఎస్ఎస్ఆర్ శ్రీనివాస్ వర్చువల్‌గా ఓఎన్‌డీసీలో ఎలా రిజిస్టర్ చేసుకోవాలి? ఏ విధంగా ఉత్పత్తులను అప్‌లోడ్ చేసుకోవాలని అనే దానిపై అవగాహన కల్పించారు. అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, యూసీడీ పీడీ సత్యవేణి, డి.లక్ష్మి, బి.రమణమ్మ, డీపీవోలు ఎంవీడీ ఫణిరామ్, కె.కనకమహాలక్ష్మి వివిధ రకాల వ్యాపారస్తులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నగర వీధుల్లో ఎడారి ఓడ


ఎడారిలో ఉండే ఒంటెలను అప్పుడప్పుడు సాగరతీరంలో చూస్తుంటాం. కానీ ఇప్పుడు నగర పురవీధుల్లో ఒంటె కనిపించడం ఆశ్చర్యంగా ఉంది. బుధవారం జ్ఞానాపురం వద్ద ఈ ఒంటె కనిపించి చుట్టుపక్కల వారిని ఆకర్షించింది.
–సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

## కాలుష్య నియంత్రణకు హెచ్‌పీసీఎల్ కృషి అభినందనీయం

ఆరిలోవ: నగరంలో కాలుష్య నియంత్రణకు హెచ్‌పీసీఎల్ చేస్తున్న కృషి అభినందనీయమని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ జోన్–2 పరిధి ముడసర్లోవ గార్బేజి ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్ ఆవరణలో బుధవారం హెచ్‌పీసీఎల్ సహకారంతో మొక్కలు నాటారు. హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంగనాథన్ రామకృష్ణన్‌తో కలసి కమిషనర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కలుష్య నియంత్రణకు హెచ్‌పీసీఎల్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.88 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. ఆ నిధులతో నగరంలో 26,500 మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. దీనిలో ప్రజలను కూడా భాగస్వాములను చేసి నగరంలో పలుచోట్ల మొక్కలు నాటించే కార్యక్రమాలు చేపడతామన్నారు. ముడసర్లోవ గార్బేజి ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్ ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటించి నందనవనంగా తయారు చేయాలని అదనపు కమిషనర్ సోమన్నారాయణను ఆయన ఆదేశించారు. హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంగనాథన్ మాట్లాడుతూ విశాఖ నగరాభివృద్ధికి, కాలుష్య నిర్మూలనకు సామాజిక బాధ్యతలో భాగంగా తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ పి.శివప్రసాద్‌రాజు, పర్యవేక్షక ఇంజినీర్ గోవిందరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ దిలీప్, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిశోర్‌కుమార్, పలు విభాగాల ఏఈలు తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటి నీరు పోస్తున్న జీవీఎంసీ కమిషనర్, హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు

## • గుడ్డు వంకాయ


గుడ్డుని తలపిస్తున్న వంకాయలు వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన ఎం.సన్నిబాబు పొలంలో గుడ్డు వంకాయలు సాగు చేస్తున్నారు. ఈ వంకాయలను సీతమ్మధార రైతుబజారుకు తేవడంతో వినియోగదారులు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. ఈ వంకాయలు కిలో రూ.40 పలుకుతున్నాయి.

## • నల్ల బరబాటీ


సబ్బవరం మండలం తవ్వవానిపాలేనికి చెందిన సింగంపల్లి లక్ష్మి పొలంలో పండించిన నల్ల బరబాటీలు వినియోగదారులను ఆశ్చర్యంలో ముంచెత్తాయి. సాధారణంగా బరబాటీ లేత ఆకుపచ్చ రంగులో ఉంటాయి. కానీ, ఇవి నలుపురంగులో ఉన్నాయి. ఈ బరబాటీలు కిలో రూ.46 వంతున విక్రయించారు.

- సీతమ్మధార

## వృద్ధులను గౌరవించాలి

ఏయూక్యాంపస్: సమాజంలో వృద్ధులకు గౌరవప్రదమైన జీవనం కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని హెరిటేజ్ ఫౌండేషన్ ఇండియా చైర్మన్ డాక్టర్ కె.ఆర్ గంగాధరన్ అన్నారు. హెరిటేజ్ ఫౌండేషన్ ఆర్‌టీసీసీ కేంద్రం, కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ, ఏయూ జాతీయ సేవా పథకం సంయుక్తంగా బుధవారం ఉదయం బీచ్‌రోడ్డులో నిర్వహించిన అవగాహన నడకను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగాధరన్ మాట్లాడుతూ సమాజంలో వృద్ధులకు తగిన గౌరవం ఇవ్వడం, వారికి భద్రత, భరోసా కల్పించడం ఎంతో అవసరమన్నారు. సమాజంలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను వివరిస్తూ వారి ప్రాధాన్యతను తెలియజేసే విధంగా అవగాహన ర్యాలీ చేపడుతున్నామన్నారు. వృద్ధులు గతానికి, ప్రస్తుతానికి వారధులుగా నిలుస్తారని.. వారి జ్ఞానాన్ని, అనుభవాన్ని నేటి తరం యువతకు చేరువ చేయడం ఎంతో అవసరమని అన్నారు. ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక సమాజంలో వృద్ధులకు తగిన గుర్తింపు, గౌరవం, తోడ్పాటు లభించడం లేదనే వాస్తవాన్ని మనం దరం ఒప్పుకోవాలన్నారు. ప్రధానంగా యువతకు వృద్ధులపై అవగాహన కల్పించడం, వారినే సారథులుగా మార్పు చేయడం అవసరమన్నారు. కార్యక్రమంలో హెరిటేజ్ ఫౌండేషన్ ప్రతినిధులు, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.


బీచ్ రోడ్డు నిర్వహించిన ర్యాలీ

సాక్షి క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**
I, **UMAMAHESWARI B** (New Name) W/o K B Venkateswara Rao, Resident at D.No. 50-53-11/9/1, Ward -11, Resapuvanipalem, P & T Colony, Seethammadhara, Visakhapatnam - 530 013, A.P. Now changed my name from **UMAMAHESWARI K B** (Old Name) to **UMAMAHESWARI B** (New Name). Hence forth I will be called as **UMAMAHESWARI B** (New Name) for all purpose.

**CHANGE OF NAME**
I, **K B VENKATESWARA RAO** (New Name) S/o K.Appala Narayana, Resident at D.No. 50-53-11/9/1, Ward -11, Resapuvanipalem, P & T Colony, Seethammadhara, Visakhapatnam - 530 013, A.P. Now changed my name from **K B VENKATESWAR RAO** (Old Name) to **K B VENKATESWARA RAO** (New Name). Hence forth I will be called as **K B VENKATESWARA RAO** (New Name) for all purpose.

**CHANGE OF NAME**
I, **YELLAPU HARITHA GAYATHRI SASIKALA** (New Name) W/o Yellapu Lokesh Resident at D.No. 2-64, Rajupeta (V), Kotauratla (M) Visakhapatnam (Dist.) - 531085, A.P. Now changed my name from **SURISETTI HARITHA GAYATHRI SASIKALA** (Old Name) to **YELLAPU HARITHA GAYATHRI SASIKALA** (New Name). Hence forth I will be called as **YELLAPU HARITHA GAYATHRI SASIKALA** (New Name) for all purpose.

**CHANGE OF NAME**
I, **POORNA KASI VISWESWARA RAO ATHIKINASETTI**, S/o A.G. Maheswara Rao, previously called **Visweswara Rao Athikinasetti**, resident of # 49-28-22, Flat No.302, Athikinasetti Enclave, Madhuranagar, Akkayyapalem, Visakhapatnam-530016. Now changed my name from **VISWESWARA RAO ATHIKINASETTI** to **POORNA KASI VISWESWARA RAO ATHIKINASETTI**. Henceforth I will be called as **POORNA KASI VISWESWARA RAO ATHIKINASETTI** (New Name) for all purpose.

Education

■ A.P. ఓపెన్ స్కూల్ 10th, 12th, ఆంధ్రా, నాగార్జున యూనివర్శిటీల నుండి డిస్టెన్స్ B.A. B.Com, B.Sc, MA, M.Com, M.Sc, MBA, MCA లకు పాస్ గ్యారంటీ గైడెన్స్. ఫోన్ : 99668 48888 [V- 823951]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12678]

Wanted

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1253910]

■ ఆప్తా హోమ్ కేర్ హైదరాబాద్ కేరటేకర్స్ కావలెను. జీతం: 16–20 వేలు, సంవత్సరం లోపు 22–25కి పెరిగే అవకాశం. 20–45 లోపు M/F ఉచితభోజనం,వసతి. 7680922316 [G-1830]

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటివద్దనే వుంటూ ఒక గంట పార్ట్ టైం మాన్యూవల్ వర్క్ చేయుటకు స్త్రీ/పు॥ కావలెను. వీక్లి పేమెంట్స్ వీక్లి 4000/- వివరాలకు వాట్సాప్/కాల్. 9885682589 [G-9064]

■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ18k Ph: 9912011899, 9912011499 [SCA-24000548]

www.sakshi.com

**గమనిక**
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

| | |
|---|---|
| మురళీనగర్, మాధవధార | : 90101 33346 |
| NAD, కంచరపాలెం | : 90108 10033 |
| గోపాలపట్నం, పెందుర్తి | : 70759 89701 |
| సీతమ్మధార, ద్వారకానగర్ | : 90100 55116 |
| డాబాగార్డెన్స్, జగదాంబ / MVP కోలనీ, మద్దిలపాలెం | 90101 96663 |
| గాజువాక | : 97059 33394 |

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం